

ఇండియా భూభాగంలో ఫ్రెంచి సామ్రాజ్యవాదుల పరిపాలనకు నిరసన తెలుపుతూ గత సోమవారంనాడు ఢిల్లీలో ప్రజా-సోషలిస్టు పార్టీవారు ప్రదర్శనం జరిపారు

చిన్నకథ

★ అల్లుడి ఆదర్శం ★

రచన

ఓగేటి శివరామకృష్ణ

విశాలను పండుగకు తీసుకుపోదామని, ఆమె తండ్రి నారాయణయ్య వచ్చాడు. మామ, తాను వచ్చిన విశేషం చెప్పినతరువాత "ఇంకా అనవసరంగా ఈ కరువురోజుల్లో పండుగ లేమిటి మామగారూ! ..ఎక్కడివాళ్ళక్కడ వుంటే సరిపోతుంది. పెద్దవాళ్లు . మీరు మరో విధంగా మాత్రం అనుకోకండి"—అన్నాడు అల్లుడు శివరావు.

నారాయణయ్య చిరునవ్వు నవ్వుతూ, "అంతేననుకోవోయ్. కాని పండుగకు పుట్టింట పెలుగురుబిడ్డలూ తిరిగితే, ఆనందించాలనే కోర్కె తల్లిదండ్రులకు వుంటూవుంటుంది. మీ అక్కయ్యను గూడా పండుగకు తీసుకొని వస్తున్నారు గదా!.. ఏదో కలిగినదాంట్లోనే—ఆనందంగా పండుగ జరుపుకుపోవాలని, నా తలంపు. మరోవిధంగా చెప్పరు—" అన్నాడు.

"అవు ననుకోండి కానీ—ఇది అనవసరపు ఖర్చని, నా వుద్దేశం-" అన్నాడు శివరావు.

"ఇలాంటి ఖర్చులు మనం తప్పించుకో కూడదు... ఏమంటావ్?"—అంటూ చిరునవ్వు నవ్వాడు నారాయణయ్య.

"ఇంక మీతో ఏం చెప్పగలను కనుక—సరే తీసుకుపొండి.. .."—అన్నాడు శివరావు

విశాల, పుట్టింటికి ప్రయాణ మవుతూంది. నారాయణయ్య ఆమెను తీసుకుపోతూ: "నువ్వు గూడా పండుగకువస్తే బాగుంటుంది" అన్నాడు తలదించుకొని. శివరావు ఆయనవైపు పరీక్షగా చూశాడు. మామ నోటి చివరనుంచి, ఆ మాట అన్నాడనీ-ఆయన ఆ మాటలు, కాంతివంతమైన ముఖంతో అనలేదనీ—శివరావు తలపోశాడు, అతడికి మామగారి పరిస్థితి పూర్తిగా తెలుసు. పూర్తిగా చితికిపోయిన కుటుంబం ఆయనది. ఏదో గౌరవంగా బ్రతుకుతున్నాడాయన. కానయితే ఆయన మనస్ఫూర్తిగా అన్నా అనకపోయినా 'నువ్వుకూడాపండుగకు రావోయ్'—అనటంతోటే బాగుంది... మీ కిదో ఖర్చుకూడానా—' అని అనలేకపోయాడు.

ఒక నవ్వునవ్వి, తిరిగి మామవంక చూచి; "అలాగే లెండి"—అన్నాడు శివరావు నారాయణయ్య "తప్పక రావాలి సుమా!"అని తిరిగి హెచ్చరిక చేయలేదు; అందువల్ల మామను గూర్చిన అభిప్రాయం, శివరావు దృఢం చేసుకొన్నాడు. వెళ్ళగూడదని మనస్సులో అనుకొన్నాడు; తన మామ స్థితి పూర్తిగా అవగాహన చేసుకొన్న శివరావుకు ఆయనమీద పూర్తి సానుభూతి వుంది. తా మయితే యింత కలిగి మసులుతూన్నా, విజ్ఞీగి మామగారి పట్ల ప్రవర్తించగూడదనీ, ఆయన నే విధంగానూ శ్రమపెట్టగూడదనీ అనేక మార్లతదనుకొన్నాడు. కాని యింతవరకూ రెండు మూడు మార్లు మామ బలవంతంచేత తా నత్తవారింటికి వెళ్ళటం, వా రిచ్చే కానుకలు పుచ్చుకోటం తప్పనిసరియైనది తా నయితే యెప్పటికప్పుడు "ఇవన్నీ నా కిప్పు డెందుకండీ" అంటున్నా మామ [illegible] సమయంలో తప్పక పుచ్చుకోవాలి నాయనా!" అని మామగా రంటూ, అంటగట్టేవారు. ఆ సమయంలో మరి కాదనక తాను పుచ్చుకొనేవాడు.

మామను, యిప్పుడు పూర్తిగా అర్థం చేసుకొన్న శివరావుకు, మామ నారాయణయ్య మరోమారు "తిరిగి పండుగకు నువ్వే తప్పక రావోయ్" అని చెప్పకపోవటం మంచిదిగానే తోచింది. ఈ పండుగకు యేదో....ఆయన పిలిచినా, వెళ్ళగూడదనీ, ఆయనను బాధ పెట్టగూడ దనుకొనీ—అప్పుడు శివరా వనుకొన్నాడు. ఆ నిశ్చయంతోనే అతడు పండుగ వెళ్ళిపోయేవరకూ, యింటివద్దనే వుందామనుకొన్నాడు. కాని, ఆ నిశ్చయానికి ఆదిలోనే విఘ్నం యేర్పడింది.

నారాయణయ్య, బండి తీసుకురావటానికి వెళ్ళిన సమయంలో, భర్తను వంటరిపాటున కలుసుకొన్న విశాల, అతడి వయిపు ఆశగా "చూస్తూ, పండుగకు మీరు తప్పక వస్తారు కదూ?"—అంది.

"ఎందుకూనే రాను"-అని నా సాభిప్రాయంతోనే అన్నాడు శివరావు. "ఆదేమిటీ!" ఆశ్చర్యంగా ప్రశ్నించింది విశాల.

"ఏం లేదు!-" అసలు సంగతి బయట పెట్టక అన్నాడు శివరావు; విశాల మరోవిధంగా వూహించింది.

"మా నాన్న మీతో చెప్పలేదా?"—దిగులుగా అడిగింది విశాల.

"చెప్పకేం....పండుగకు రమ్మని చెప్పారు" అన్నాడు శివరావు.

"మరి....?"—అంది విశాల.

"ఊరికేనే"—అన్నాడు శివరావు, భార్యకు సంగతి చెప్పి బాధపెట్టటం అతడికిష్టంలేదు.

"నా మీదగాని కోపం వచ్చిందా?"—అమాయకంగా అంది విశాల.

"వెఱ్ఱిదానా!....ఏం లేదు ..."—అన్నాడు శివరావు

"మరి....?" విశాల దిగులుగా శివరావు ముఖంలోకి చూచింది.

"ఏం లే దనటం లేదూ? "అని నవ్వాడు శివరావు.

ఈ మాట విశాల తన ఆఖరి అస్త్రాన్ని ఉపయోగించి పడేసింది.

"మీరు పండుగకు రాకుంటే నే చచ్చినంత వొట్టే" అందామె

"ఛస్....అదేం పని ... ముందు వొట్టు తీసేయ్!" అన్నాడు శివరావు.

"ఊహూ ...మరి మీరు వస్తానంటే—" నాన్చుతూ అంది విశాల.

"వీలుంటే తప్పక వస్తాను లే ముందా వొట్టు తీసేయ్" అన్నాడు గట్టిగా శివరావు!

వీలుకేం సెలవులేగా. వస్తానంటే వొట్టు తీస్తాను"—అంది పెంకితనంగా విశాల

మంచికి పోతే చెడుగు ఎదురు వచ్చినట్లయింది శివరావుకు.

తాను మామకు సహాయపడదామనుకుంటే—ఆది భార్యకు—మరో భావంతో కోపం తెప్పిస్తూంది. పోనీ అసలు తన ఉద్దేశం చెబితే, కుమిలి కుమిలి ఏడుస్తుంది. పైగా తాను సహితం పోనంటుంది. పైగా ఆమెది పిరికి హృదయం. అనుభవం కలది కాదు....అలాంటి పిరికి హృదయంగల దానికి, సంగతిచెప్పి బాధ పెట్టడం ఏ మ్మాత్రం న్యాయంకాదని శివరావు తలంపు మరి ఆమె వొట్టు తీయటానికి అంగీకరించటమే గత్యంతరం.

"సరేగాని....ముందు వొట్టు తీసేయ్"—అన్నాడు తిరిగి శివరావు

"వస్తానని, చేతిలో వొట్టు వేయండి"—అంది విశాల చేయి జాపి.

"సరే"నని — శివరావు ఆమె చేతిలో వొట్టు వేశాడు.

ఇప్పటికి విశాల ముఖంలో కాంతివెలసింది.

"పండుగకు రమ్మని మా నాన్న పిలుస్తే మీ కయితే యెందుకండీ!"—అంది నవ్వుతూ విశాల.

"వస్తా నన్నానుగా: మరి గొడవెందుకూ" [illegible] అన్నాడు శివరావు.

ఇంతట్లో బండికోసం వెళ్ళిన నారాయణయ్య, బండితో వచ్చాడు "అమ్మాయ్! సిద్ధమేనా?" అంటూ.

"నాన్న వచ్చారు!" అంటూ విశాల అక్కడనుంచి వెళ్ళిపోయింది.

శివరావు ఆలోచిస్తూ అక్కడే నిల్చుండిపోయాడు.

బండిలో సామాను పెట్టడం అయింది.

"అమ్మాయ్....నీ మామగా రింట్లో లేరు కామోను! అత్తగారితో చెప్పి, త్వరగా వచ్చి యెక్కు, అవతల రైలుకు టైమవుతోంది!" అన్నాడు నారాయణయ్య

వంట గదిలో ఏదో పని చేసుకుంటున్న అత్తగారితో చెప్పి, బండి ఎక్కడానికి వీధిలోకి వచ్చింది విశాల.

శివరావు కూడా వీధిలోకి వచ్చాడు, ఆమె బండి యెక్కుతూ:—"నే చెప్పింది మీకు జ్ఞాపకం వుంది కదూ?"అంది.

"ఆ" అని మాత్రం వూరుకొన్నాడు శివరావు

బండి కదిలింది. తిరిగి మరొకమారు గౌరవానికి చెబుతాడేమో మామగారనుకొన్నాడు శివరావు కాని ఆయన బండి కదులుతూంటే ముందడుగు వేస్తూ:—"వస్తానోయ్" అని మాత్రం వూరుకొన్నాడు.

"వుంటానండి" అంటూ శివరావు ఇంట్లోకి తిరోగమించాడు.

* * * *

కొద్ది రోజులు గడిచాయ్....పండుగ దగ్గర పడింది శివరావుకు, వెళ్ళటమా ? మానటమా అన్న సమస్య తేలలేదు ఒక మూల భార్యకు వాగ్దానం చేశానే అని, అతడి మనస్సు పీకుతూ వెళ్ళమంటూంది ; మరొక ప్రక్క—మామ యొక్క పరిస్థితులు గుర్తించి—ప్రయాణం మానమని హెచ్చరిక చేస్తూంది ఈ లా ద్వి అభిప్రాయాలతో శివరావు తికమకలాడుతూంటే—గోరుచుట్టుపై రోకటిపోటు విధంగా—మరొకటి వచ్చి పడింది. శివరావు అక్కగారు పండుగకు వచ్చింది ఇల్లంతా ఆమె పిల్లలతో కలకల లాడుతూంది; ఒకదినం ఆమె తిన్నగా వుండక తల్లితో, "ఏమే అమ్మా! తమ్ముడీమారు పండుగకు వెళ్ళడా?" అంది.

నారాయణయ్య అంటే ఇష్టంలేని శివరావు తల్లి—సమయం బాగా ఉపయోగించుకొంది, "ఏమో! ఎవరికి తెలిసేదును, అయినా, ఆ ముఖం పిలిచి ఏడుస్తుంది కనుకనా గట్టిగా, ఇద్దరు చుట్టాలు వస్తే అన్నం పెట్టలేని ముఖం అల్లుడ్ని పండుగకు తీసుకుపోతుంది కూడానా?" అందావిడ.

ఈ మాటలు, ఇంట్లోనే వున్న శివరావు వినటం జరిగింది మామగారు, తన్ను రెండు, మూడు మార్లు తీసుకుపోయి ...తగిన విధంగా గౌరవించినమాట వాస్తవం. ఆయన ఇచ్చిన కానుకలకు-తనకు తాను తృప్తిపడ్డాడు. అందువల్ల తల్లి అనవసరంగా మామను నోట్లోవేసుకోటం, అతడు సహించలేకపోయాడు: "మా మామగారు నా కెటువంటి లోటూ చేయలేదు నువ్వు ఏ విధంగా గొణుక్కుంటే నాకేం", అన్నాడు తల్లిదగ్గరకు వచ్చి శివరావు

అలా అన్నందుకు, తల్లి నిర్ఘాంతపోయింది. తమ్ముడికి కోపం వచ్చిన సంగతి కనిపెట్టిన అక్కగారు: "సరే అయితే! నిన్ను పండుగకు రమ్మని పిలిచారా తమ్ముడూ ?"—అని అడిగింది? 'ఆ'—అని కచ్చితంగా జవాబిచ్చాడు శివరావు

"మరయితే పోతావా ?"—అక్కగారు నవ్వుతూ అంది!

"ఇటువంటి పరిస్థితుల్లో వెళ్ళను"—అని శివరావు తేల్చి చెప్పటం అసాధ్యం. ఒక వేళ, ఆ విధంగా చెప్పిన పక్షంలో, తల్లీ కూతుళ్లు కలసి తననూ, తన భార్యనూ, తన మామగారినీ ఇష్టమొచ్చిన విధంగా నోట్లో వేసుకుంటారు అందువల్ల తటుముకోకుండా శివరావు వెంటనే "వెళతాను!" అన్నాడు.

అంతటితో—తల్లీ కూతుళ్ళ నోళ్లు, ఒకరి నొకరు చూసుకోవటంతో మూతపడ్డవి.... అయితే, శివరావు సమస్య ఒక విధంగా పరిష్కార మయింది. మరొక విధంగా మిగిలి పోయింది. అతడికి, అత్తవారింటి కెళ్ళి మామగారి వద్దనుంచి పండుగ బహుమానాలు గుంజటం మనస్ఫూర్తిగా ఇష్టంలేదు అతడికి హృదయ పూర్వకంగా వెళ్ళాలనికూడా లేదు, కానయితే భార్యకు తప్పక వస్తానని వాగ్దానం చేశాడు; అదెలావున్నా 'వెళతాను' అని తల్లి ముందూ, అక్కగారిముందూ కచ్చితంగా పలికాడు. తాను గనుక వెళ్ళకపోతే తల్లీ కూతుళ్లు తన్ను మాటల ద్వారా ఏడ్పించటం తప్పదు.

[illegible], కాలం [illegible], శివరావు పండుగకు వెళ్ళక తప్పదని నిశ్చయించుకొన్నాడు వెళ్ళిన పక్షంలో మామగారిని తాను ఒక విధంగా బాధపెట్టడం అన్న సంగతి అతడికి తెలుసు. కాని వెళ్ళక తప్పదు. ఏం చేయటం? —శివరావు ఆలోచించి ఆలోచించాడు. [illegible] ఏ నిర్ణయానికి రాలేకపోయాడు, పండుగ మరొక రోజు మాత్రమే వుంది.

దానికి తోడుగా ఆ రాత్రి భోజనాల దగ్గర తిరిగి అక్కగారు తండ్రి భోజనంచేసి వెళ్ళిపోయిన తరువాత—"ఏరా! అత్తవారింటి కెడతా నన్నావుగదా! ఎప్పుడు వెడతావు ?" అని అడిగింది శివరావుకు నిజంగా వొళ్ల మండిపోయింది. దాన్ని ఏలాగో వుగ్గబెట్టుకొని-

"రేపు రాత్రికి" అన్నాడు.

"బాగుంది! ఇక్కడకు మీ బావగారొస్తూంటే, అక్కడకు నువ్వు దయచేస్తావన్నమాట" అని నవ్వుతూ అంది అక్కగారు

"బాగుంది! ఎవళ్ళ అత్తవారిళ్ళకు వాళ్ల వెళ్లకుండా వుంటా రేమిటి"—అంది తల్లి వ్యంగ్యంగా,

శివరావు తిరిగి జవాబివ్వలేదు మాటాడకుండా భోజనం ముగించి తన గదిలోకి పోయి నిద్రపోయాడు. తల్లీ, కూతురూ ఏమేమో చాలాసేపు మాట్లాడుకొన్నారు.

* * * *

మరునాడు—

శివరావు ఆఫీసుకు పోతూంటే దార్లో పోస్టుమ్యాను కన్పించి "మీ కో మనియార్డ రుంది" అంటూ దగ్గరకు వచ్చాడు.

శివరావు మనియార్డరు ఫారం తీసుకొని సంతకంచేసి, కౌపను చించి చదువుకొన్నాడు అది తన దగ్గర చే బదులుగా రెండు మాసాల క్రితం పుచ్చుకొన్న పొరుగూరి మిత్రుడు పంపాడు.

శివరావు డబ్బు లెక్కపెట్టుకుంటూంటే పోస్టుమ్యాను బుఱ్ఱ గోక్కుంటూ, "పండుగ మామూలండీ!" అన్నాడు పోస్టుమ్యాను అలా అడగటంతోటే,అతడికో ఆలోచన హఠాత్తుగా కల్గికట్టుంది నవ్వుతూ, "పండుగ మామూలు కావాలా తీసుకో" అని రెండు రూపాయల కాగితం అతడి కిచ్చి వడిగా ఆఫీసుకు నడచిపోయాడు.

సాయంకాలమైంది ఆఫీసు పండుగకోసం మర్నాడు రోజు ఎప్పుడ మూసినట్లుగా నోటీసు వచ్చింది, సంతకంపెట్టి, ఆఫీసు టయి మవటంతోటే వడిగా బజారుకు నడచి బట్టల దుకాణంలోకి పోయి, ఏవేవో కొని వాటి నొక అట్టపెట్టిలో పెట్టించుకొని తిరిగి ఇంటికి వెళ్లకుండా, స్టేషనుకు నేరుగా పోయి, అప్పుడే వచ్చిన అత్తవారి వూరివైపు పోయే రైలుబండి ఎక్కాడు శివరావు

* * * *

అత్తవారింట్లో మర్నాడు ప్రొద్దుట తలంట్లూ, కాఫీలూ పూర్తయిన తరువాత, శివరావు గదిలో మంచంమీద పరుండి ఏ మేమిటో ఆలోచిస్తూంటే, విశాల గదిలోకి వచ్చింది ఆమె మంచం దగ్గరకు వచ్చి, "మీరు రారనుకొన్నాను:" అంది నవ్వుతూ.

"నువ్వు వొట్టు పెట్టిన తరువాత రాకుండా పోతానా? నీకోసం రావాలిగా:" అంటూ తిరిగి నవ్వాడు శివరావు

"మరా దాబు మాట లెందుకండీ! ఎలాగయినా అల్లుడి హోదా బెస్తుగా ప్రదర్శించ దోయారు కాని సాగలేదు" అంది నవ్వుతూ విశాల

శివరావు విశాల తన్ను అర్థం చేసుకోనందుకు విచారించలేదు మరోక్షణం ఆగి, అది సరేగాని, పండుగకు నీ కెటువంటి చీర కావాలో చెప్పు" అని అడిగాడు.

"కొనిపెట్టేవాళ్లకు చెల్లదు!" సాగదీసుకుంటూ అంది విశాల!

"పోనీలే గాని—లేత కనకాంబరం రంగుమీద మామిడి పిందెలున్న చీర ఇదివరలో కావా లన్నావుగా!" అన్నాడు శివరావు.

"అన్నా ననుకోండి"

"మరయితే దాన్ని కొనుక్కు రమ్మంటావా?"

"మీ ఇష్టం" అంటూ విశాల భర్త కళ్ళల్లోకి చూసింది.

"నాకు కొనాలనే వుంది!!"

"సరయితే కొనండి!"

"అలాగే అయితే" అని శివరావు తాను క్రితం రాత్రి తెచ్చిన ప్యాకెట్‌లోంచి చీరా, అదేరంగు జాకెటు గుడ్డా తెచ్చి విశాల కిచ్చాడు.

"ఏమి టివి?" ఆశ్చర్యంగా అడిగింది విశాల!

"నువ్వు తెచ్చిపెట్టుకున్నావుగా - పండుగ బహుమానం;"

"నే నెప్పుడో పూరికే చెప్పాను" అంది విశాల

"నే నెప్పుడు నిజంగా తెచ్చాను తీసుకపో" అన్నాడు శివరావు:

"మీ రెంత మంచివారండీ!" అంది విశాల.

"నీ పెంకితనం చూసే!" అని తిరిగి నవ్వాడు శివరావు

ఇంతట్లో విశాలను తల్లి కేకవేసింది. అందువల్ల మరి సంభాషణ జరగటానికి వీలులేకపోయింది.

"వస్తున్నా" అంటూ విశాల వెళ్ళిపోయింది ఆలోచిస్తూ మంచంమీద పడుకొన్న శివరావును బావమరది వచ్చి కొంత అల్లరి కాలక్షేపం చేశాడు

* * * *

పన్నెండు గంటలకు ఆనందంతో నిండిన కబుర్ల మధ్య భోజనా లయిపోయాయి భోజనానంతరం నేరుగా తన గదిలోకిపోయి మంచంమీద తిరిగి పడ్డాడు శివరావు ఒక గంట కాలమయితే నిద్రపోయాడుకాని తరువాత, లోపల జరుగుతూన్న సంభాషణ అతడి నిద్ర కాటంకం కల్గించింది భోజనం చేస్తూ, అత్తగారు మామగారి నంటూంది:'ప్రొద్దుటినుంచీ కదలి వెళ్లమని చెబుతూంటే వినిపించుకొన్నది లేదు ఇంకా ఇంట్లో అలా పచార్లుచేస్తూ కూర్చుంటే ఏలాగ, ఏదో దుకాణంలోకి పోయి, ఏవో ఒక రకం తీసుకు రండి పండుగపూటా, కనీసం బట్టలయినా ఇవ్వకపోతే బాగుండదు" అని.

"ఏం చేయమంటావే ఈ సారి పరిస్థితులన్నీ అలా సమకూడినాయి. నేనూ ఎంతగానో ప్రయత్నించాను, కాని ప్రయోజనం లేకపోయింది సొద్యమైనప్పుడు తీసుకురాలేదూ? అని మామగా రంటున్నారు

"అయ్యో రామచంద్రా! మీ రలాగంటే ఏలాగండి....పోనీ అమ్మాయి సంగతి తరువాత చూసుకొందాం అతడే దానికేదో కొని తీసుకువచ్చాడు. మరలాంటప్పుడు ఎక్కడికో వెళ్ళి ఏదో వొకటి అతడికి తీసుకు రాకపోతే మనం అభాసుపాలవవలసి వస్తుంది."

ఈ మాటలు విన్న శివరావు కంతా అర్థం అయింది. మామగారి పరిస్థితి ఎప్పుడో అర్థం చేసుకొన్న శివరావు కాయన మీద పరిపూర్ణమైన సానుభూతివుంది ఆయన నేవిధంగానూ శ్రమ పెట్టగూడ దనుకొన్న తాను రావటంతోటే తిరిగి ఆయన కది ఉదయించింది, ఆయనను అనవసరంగా బాధపెట్టడం శివరావు కిష్టం లేదు. అందువల్ల వెంటనే అతడు తన భార్యను పిలిచాడు.

అల్లుడి ఆదర్శం

"ఏమండీ!" అంటూ అప్పుడే కడుక్కున్న చేయి తుడుచుకుంటూ విశాల వచ్చింది.

"ఏమిటే కథ దాచకుండా .... చెప్పు" అన్నాడు శివరావు.

విశాల వదనం వెలవెల బోయింది: కళ్ల నీళ్లు తిరిగాయి : "ఏముంది" అంటూ జరిగినదంతా చెప్పింది.

"ఓస్! దాని కింత హంగామా ఎందుకూ? ఇదుగో ఇది తీసుకుపోయి మీ నాన్న కిచ్చిరా" అన్నాడు ప్యాకెట్ భార్య కందించి.

"ఏమిటివి?" అంటూ విశాల తీసి చూసి తెల్లబోయింది.

"చూడు" అన్నాడు శివరావు; విశాల చూస్తూ: "మీరు కొనుక్కు తెచ్చుకొన్నారా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"అవును. నీ చీరతోబాటుగా నేనూ జామారు కొనుక్కున్నాను. మీ నాన్న నాకు నచ్చినవి కొంటారో, కొనరో నని నేనే కొనుక్కు తెచ్చుకొన్నాను. అనవసరంగా యెందుకని ప్రొద్దుట నీకు చెప్పలేదు." అన్నాడు శివరావు.

"బాగుంది" అంది దిగాలుగా విశాల.

"పోయి ముందు మీనాన్న కిచ్చిరా ...... లేకుంటే ఆయన బజారులోకి పరుగెడతారు" నవ్వుతూ అన్నాడు శివరావు.

విశాల వెళ్ళింది.

తర్వాత లోపల ఏవేవో గుసగుసలు జరిగినాయి. ఎంత ప్రయత్నించినా శివరావు కేమీ విన్పించలేదు. మరికొద్ది నిముషాల తర్వాత విశాల మాత్రం వచ్చి: "ఏమండీ! వాటి ఖరీదెంత ?" అని అడిగింది.

"ఏం?" అన్నాడు శివరావు.

"ఏం ఏమిటి మీరు నచ్చినవి కొని తెచ్చుకొన్న తరువాత, డబ్బయినా ఇవ్వద్దూ?" అంది తలదించుకొని విశాల.

"వాటికి డబ్బు ఇస్తారా...సరే ఇవ్వమను" నవ్వుతూ అన్నాడు శివరావు.

"ఎంతకు కొన్నారు ?"

"అయిదువేలు" నవ్వి అన్నాడు శివరావు.

"వేళాకోళం చేయకండి. ఇది అలాంటి సమయం కాదు...... ..మా నాన్న అడిగి రమ్మన్నాడు" అంది విశాల.

తన్ను మామ సహితం అర్థం చేసుకోనందుకు శివరావు కొంచెం విచారించాడు. కాని పైకి: "అయితే, మీ నాన్న బట్టల విలువ ఇస్తామన్నారా ?" అని ప్రశ్నించాడు.

"అవును!" అంది విశాల.

"మరయితే ఆ బట్టలు నే కట్టుకోవటం జరుగదని చెప్పు" అన్నాడు శివరావు.

"అదేమిటండీ!" అంది విశాల.

"అంతే! అలానే చెప్పు"అన్నాడు శివరావు విశాలవైపు చూస్తూ.

అప్పుడు నవ్వుతూ, ఏమే అర్థం చేసుకొన్నట్లుగా ఇంట్లోకి పోయి వచ్చింది.

"చెప్పావా?"

"చెప్పాను" అంది విశాల.

"ఏ మన్నారు మీ నాన్న!"

"ఏమీ అనలేదు కాని, నిదానంగా చూసి వూరుకొన్నా రంతే:"

"బాగు బాగు ఇంతవరకూ అంతా బాగానే జరిగింది. నీకుమాత్రం ఒకమాట," అన్నాడు శివరావు.

"ఏమి టది?" విశాల ప్రశ్నించింది.

"ఈ చిన్న దాన్నిగురించి మీ నాన్నతో యెటువంటి బాధా మనస్సులో పెట్టుకోవద్దని చెప్పాలి. మరొక విషయం ఏ మంటే అందరితోటీ — అంటే మావాళ్ళతో సహితం — ఇవి మీవాళ్లు పండుగ బహుమానంగా మాత్రం ఇచ్చారని చెప్పాలి తెలిసిందా! అలా చెప్పకుంటే అనవసరపు గొడవ జరుగుతుంది" అన్నాడు శివరావు.

"అబ్బ! మీ రెంత మంచివారండీ!" అంది ఆనందంతో వచ్చిన కన్నీళ్లు తుడుచుకుంటూ విశాల.

"నా మంచితనాని కేంగాని........ముందు సంగతి పోయి చూడు" అన్నాడు శివరావు.

ఈ మాటలన్నీ ప్రక్కగదిలోంచి చెవులు రిక్కించి విన్న మామ నారాయణయ్య ఆనంద బాష్పాలు మీది తుండుతో వత్తుకుంటూ: "నేనెంత అదృష్టవంతుడ్ని! సాధక బాధకాలు తెలిసిన ఆదర్శప్రాయుడైన అల్లుడు నాకు లభించాడు!" అనుకొన్నాడు.

గదిలోంచి బయటకు వచ్చిన విశాల తండ్రి ముఖంలోని కాంతి, ఆనందం పాలు పంచుకొంది.

సాహిత్య, శాస్త్రాల సంబంధం

గుడివాడ సభలో

శ్రీ లక్ష్మీకాంతంగారి వివరణ

గుడివాడ, ఏప్రిల్ 10— గుడివాడ క్లబ్ లిటరరీ అండ్ సైంటిఫిక్ అసోసియేషన్ కు ప్రారంభోత్సవం మార్చి 28 వ తేదీ సాయంకాలం క్లబ్ భవనంలో గుడివాడ రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీ సి రామలింగేశ్వరరావుగారి ఆధిపత్యాన ఇటీవల జరిగింది.

శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు ప్రారంభోత్సవం చేశారు శ్రీ కాకాని నరసింహారావుగారు స్వాగతం పలికారు శ్రీ లక్ష్మీకాంతంగారిని క్లబ్ కార్యదర్శి, శ్రీ ఉప్పలపాటి వీరభద్రరావుగారు సన్మానపత్రం సమర్పించి, గంధపుష్ప తాంబూలాదులతో, పట్టుపుట్టాలతో సత్కరించారు.

అనంతరం శ్రీ లక్ష్మీకాంతంగారు ప్రసంగించారు. సాహిత్య శాస్త్రాలకుగల సంబంధ తారతమ్యాలు నిరూపించారు. ఆయన ఇలా అన్నారు:

"సాహిత్యం రసానంద జనకత్వం వల్ల హృదయగమ్యం కాగా, శాస్త్రం ఆలోచనా ప్రేరకత్వంవల్ల బుద్ధిగమ్యం అవుతుంది శాస్త్రం ఆది భౌతికాన్ని అంటిపెట్టుకొని ఉంటుంటే, సాహిత్యం ఆధ్యాత్మిక శిఖరాలను చూపిస్తుంటుంది. అనేక శాఖలకు చెందిన విద్వత్సంస్కారులను ఆకర్షిస్తూ, సమర్థమైన వేదికలుగా ఏర్పడే ఇటువంటి క్లబ్బులు, అసోసియేషనులు నిరంతరం శాస్త్ర సాహిత్య సమారాధనలుచేస్తూ, బుద్ధివికాసమూ, హృదయానందం సంధానంచేస్తూ రసరాజ్య వీధులు చూపాలి "

ఉపన్యాసానంతరం కళాశాలా ప్రాచ్య శాఖాధ్యక్షులు శ్రీ యద్రోజు మాధవాచార్యులుగారు వందన సమర్పణం చేశారు.

శ్రీ బాలా త్రిపురసుందరీ నాట్యబృందం బాలికలు కుమారి వరలక్ష్మి (శ్రీ హనుమా రంగారావుగారి పుత్రిక) కుమారి రాజేశ్వరి (శ్రీ చెరువు శ్రీరాములుగారి పుత్రిక)గార్ల నాట్య ప్రదర్శనంతో కార్యక్రమం పూర్తి అయింది,

విద్యార్థి సమ్మేళన మహాసభల వాయిదా

తెనాలి, ఏప్రిల్ 9— ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సమ్మేళన్ కార్యదర్శి శ్రీ ఆర్ కె. రెడ్డిగారు ఇలా వ్రాస్తున్నారు:

"ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సమ్మేళన్ ప్రథమ మహాసభ అనివార్యమైన కారణాలవల్ల మే 7, 8 తేదీలకు వాయిదా వెయ్యడమైనది. మహాసభల సందర్భంలో వ్యవసాయ కళా ప్రదర్శనాలు ఏప్రిల్ 28 వ తేదీనుంచి మే 8 వ తేదీ వరకు జరుపబడుతవి.—యూనిట్ కమిటీ లన్నీ మహాసభల తేదీలను గమనించ వలసిందిగా కోరుచున్నాను. మహాసభల కార్యక్రమం తుది నిర్ణయం జరగానే ప్రకటించ బడగలదు."

శ్రీ కె. వెంకటేశ్వరరావు

కర్నూలు, ఏప్రిల్ 9— డెవలప్‌మెంటు డిపార్టుమెంటు సూపరింటెండెంటు శ్రీ కె. వెంకటేశ్వరరావు తాత్కాలికంగా ఆదే శాఖలో ప్రభుత్వపు కార్యదర్శిగా పనిచేస్తారు.

సంగ్రహ సమీక్షలు

కుమ్మరి మొల్ల

మొల్ల కుమ్మరికుల సంజాత, ఆమె తండ్రి అతుకూరి కేసనగురు లింగ జంగ మార్చన పరుడు, కవి, మంత్రోపాసకుడు ఆమె జీవించిన నాటి కాలంలో వైష్ణవ శైవమతస్థుల మధ్య సంఘర్షణలు ప్రబలంగా వుండేవి ఆ రోజులలో తక్కువ కులాలవారు అందులోను స్త్రీ కవిత్వం వ్రాయడం తప్పుగా పరిగణించబడే దట. తండ్రి ఉపదేశించిన మంత్ర బలంతో, దీక్షతో శ్రీరామ సాక్షాత్కారం పొంది రామాయణ మహా కావ్యాన్ని రచించి, ప్రథమ ఆంధ్ర కవయిత్రిగా శోభిల్లిన మొల్లగాథను శ్రీ ఇంటూరి వెంకటేశ్వరరావుగారు రసవత్తరమైన సన్నివేశాలతో మనోహరమైన నవలగా, పఠితల హృదయాలను పల్లవింపజేసే సరళమైన శైలిలో రచించారు. క్రౌన్ సైజు 170 పుటలు. ప్రాప్తిస్థానం: ఆంధ్రా పిల్కు పబ్లికేషన్స్, 62, సర్ మహమ్మద్ ఉస్మాన్ రోడ్, మద్రాసు—17.

ఉడుపి క్షేత్రము

శ్రీ విద్వాన్ బి. రామకృష్ణాచార్ బి. ఏ. గారి సంపాదకత్వమున వెలువడిన యీ పుస్తకములో దక్షిణ కన్నడ జిల్లా దివ్య క్షేత్రమైన ఉడుపి చరిత్ర- అందులోని దేవాలయములు-వాటిమాహాత్మ్యము-అక్కడకు పోదగు మార్గ సౌకర్యాలు సులభశైలిలో వివరించబడ్డాయి క్రౌన్ సైజు 92 పుటలు వెల 0-12-0 ప్రాప్తిస్థానం: హిందీ పుస్తక భాండారము, శ్రీ రామాంజనేయ బిల్డింగ్స్, ఉడుపి

హృదయవాణి

రచన శ్రీ టి. రామకృష్ణరావుగారు,ప్రకృతి తీర్పు, అమూల్యమైన వస్తువు,ముద్దుమరదలు, మొదటిరాత్రి, నిరాశ అనే కథానికలు యీ హృదయవాణిలో కలవు. కథలు బాగున్నవి. క్రౌన్ సైజు 40 పేజీలు వెల ఎనిమిదణాలు. కావలసినవారు: రచయిత: నర్సాపురం వ్రాయవచ్చు.

మధ్యమ-సంపూర్ణ గైడ్

రచయిత: శ్రీ శ్రీరాములుగారు, హిందీ విద్వాన్; "హిందీ ప్రచారక," పుటలు: 226 మూల్యం: 2-8-0. ప్రాప్తిస్థానం: లోకమాన్య హిందీమందిర్, గవర్నర్‌పేట విజయవాడ-2.

అన్నమాచార్యోత్సవాల ముగింపు

తిరుపతి, ఏప్రిల్ 1—శ్రీ తాళ్లపాక అన్నమాచార్యోత్సవాలు నిన్నటితో ముగిసినవి. రెండవరోజు శ్రీమతి టి టి. సీత, శ్రీ నేదనూరి కృష్ణమూర్తి, శ్రీ యం. ఏ. నరసింహాచారి, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ టి. జి. యస్. వీరరాఘవాచారి, శ్రీమతి కోకా సత్యవతి, శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావుగార్లు తాళ్ళపాక వారి కీర్తనలు పాడారు.

మూడవరోజు వుదయం శ్రీ వెంకటేశ్వరుని సన్నిధిలో విశేషపూజలు జరిగినవి. ఆ దినం సాయంత్రం శ్రీమతి పి. సీతాలక్ష్మి, సి. ఇందిర, గానసుధాకర శ్రీ బాలమురళీ కృష్ణ, శ్రీమతి వి. బి. కనకదుర్గ, శ్రీ యం. వి. రమణమూర్తి, శ్రీ వింజమూరి వరదరాజ అయ్యంగార్లు పాడారు.

శ్రీ తాళ్ళపాక సుమిత్ర భారతనాట్యంతో కార్యక్రమం ముగిసింది. ఆలిండియా రేడియో మైసూరు కేంద్రం విద్వాంసులు శ్రీ టి. యస్. తాతాచారి (ఫిడేలు), శ్రీ ఏ. వి. రంగనాదంగారు (మృదంగం), విజయవాడ కేంద్రం విద్వాంసులు, గానకళా విశారద శ్రీ అరిపిరాల సత్యనారాయణమూర్తిగారు (ఫిడేలు), శ్రీ ఐ. సింహాచలం శాస్త్రిగారు (మృదంగం) పక్క వాయిద్యాలు వాయించారు. విజయవాడ కేంద్రంవారు మూడు రోజులు గాయకులు పాడిన సంకీర్తనలను రికార్డుచేసి ప్రసారం చేశారు. దేవస్థానంవారు కూడా పాటలు రికార్డు చేశారు.

శ్రీ అన్నమాచార్య పెద తిరుమలాచార్యుల విగ్రహాలను, శ్రీ వెంకటేశ్వర స్వామి పటమును మేళతాళములతో ఊరేగించి శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయంలో యథాస్థానమున ప్రతిష్ఠించారు.

శ్రీ వరవస్తు వెంకట రామానుజస్వామిగారు ఉత్సవం జయప్రదంగా జరుపుటకు సహాయపడిన అందరికీ వందనలు సమర్పించారు.

కొత్త పత్రికలు

మంజీర

తెలంగాణా రచయితల సంఘం (హైదరాబాద్) ప్రథమ వార్షికోత్సవ సంచిక 'మంజీర' మా కార్యాలయం చేరింది.

శ్రీయుతులు వానమామలై వరదాచార్యులు, పుటపర్తి నారాయణాచార్యులు, శ్రీ శ్రీ పురిపండ అప్పలస్వామి, వాల్లపల్లి రామారావు, విశ్వం, కాళోజీ, తిరుమల బుక్కపట్నం కృష్ణమాచార్యులు మున్నగు వారి రచనలతో పత్రిక ఉదాత్త మధురంగా వుంది. ముద్రణ కూడా ముద్దుగా కుదురుతున్నది. పుటలు: 62, వెల: ఎనిమిదణాలు ప్రాప్తిస్థానం: తెలంగాణా రచయితల సంఘం, హైదరాబాద్.

పరిశోధన

చరిత్ర, వాఙ్మయాది విషయాల పరిశోధనే ప్రధాన లక్ష్యంగా గల 'పరిశోధన' ద్విమాస పత్రిక తొలి సంచిక (జయ-ఉగాది సంచిక) మా కార్యాలయం చేరింది.

శ్రీయుతులు దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి, విద్వాన్ విశ్వం, కత్రి సాంబమూర్తిశాస్త్రి, నార్ల వెంకటేశ్వరరావు, నిడదవోలు వెంకటరావు, వేటూరి ఆనందమూర్తి, కోరాడ రామకృష్ణయ్య, దివాకర్ల వెంకటావధాని, పుట్టపర్తి నారాయణాచార్యులు, బులుసు వెంకటరమణయ్య, రావూరిదొరస్వామిశర్మ, శ్రీమతి బాణగిరి రాజమ్మగార్ల రచనలున్నాయి అముద్రితమైన పాల్కురికి సోమనాథుని బసవ పంచరత్న స్తోత్రం కూడా ముద్రించబడింది. శ్రీ గన్నపురం సుబ్బరామయ్యగారి ఆశీర్వాదా లున్నాయి.

తిరుమల రామచంద్ర సంపాదకత్వంలో ప్రచురించబడే రాయలు సైజు 84 పుటల ఈ పత్రిక విడి సంచిక వెల: 12 అణాలు. సంవత్సరం చందా: ఆరు రూపాయలు ప్రాప్తిస్థానం: భాషా సేవక సమితి, 2/588, పైక్రాఫ్ట్సురోడ్డు, తిరువల్లిక్కేణి, మద్రాసు 5.

సౌత్- రయిల్‌న్యూస్

సదరన్ రైల్వేవారు ప్రకటించిన "సౌత్ రయిల్‌న్యూస్" (ఇంగ్లీషు)తొలి సంపుటి తొలి సంచిక మా కార్యాలయం చేరింది దక్షిణ రైల్వేకు సంబంధించిన వివిధ విషయాలుగల ఈ సంచిక సెమిగ్లేజు కాగితాలపై చక్కగా ముద్రించబడింది. డబుల్‌క్రౌను సైజు పుటలు 72 వెల: ఆరణాలు.

తూర్పు పాకిస్తాన్‌కు వెళ్లే నిమిత్తం పాస్‌పోర్టులకై పూర్ణియా జిల్లానుంచి 1953 లో దరఖాస్తు పెట్టినవారిని గురించి మహమ్మద్ ఇస్లాముద్దీన్ నేటి వుదయం ప్రజాప్రతినిధుల సభలో అడిగిన ప్రశ్నకు శ్రీజవాహర్‌లాల్ నెహ్రూ లిఖిత పూర్వకంగా జవాబు చెబుతూ 1040 మంది పాస్ పోర్టుల కోసం దరఖాస్తులు పెట్టారని, అందులో 901 మందికి ఇవి ఇవ్వబడ్డాయని తెలియ పరచారు.

క్షలాది ప్రజలు వాడుచున్న
రామన్ ఇంకు
ఆంధ్రుల అభిమాన సిరా
REGAL PRODUCTS Ltd., MADRAS-14

రక్తక్షీణమునకు
జండు
హెపోఫెర్రమ్.
(HEPO FERRUM

రక్తనాళములకు బలము కలుగజేయుటలోను, జీర్ణశక్తిని పెంపొందించుటలోను, రక్తక్షయమును నిర్మూలించుటలోను, పురాణజ్వరములను పోగొట్టుటలోను అద్వితీయమైనది. ఇంతియేగాక నూతన రక్తమును, బలమును వృద్ధిచేయును.

వెల 2 ఔ. 2-0-0, 4 ఔ. 3-14-0,
6 ఔ. 5-12-0.

ఆంధ్ర దేశమునందలి జండు ఏజంట్ల వద్దను, ఇతర మందుల షాపుల లోను దొరకును

దా మోదర్ అండ్ కో.
113, నైనియప్ప నాయకన్ వీధి,
మద్రాసు-3.

బ్రాంచి:
10/94, మెయిన్ బజారు రోడ్డు,
విజయవాడ.
ZANDU

నారసింహ లేహ్యము

బంగారముతో చేరినది. మేహము, నిస్త్రాణ, నిస్సత్తువ, శుక్లనష్టం, అతిమూత్రం హరించి బలమును వీర్యవృద్ధిని కలిగించును. 20తులా డబ్బీ రు. 3-4-0. పోస్టేజి అ 15.

వి. వి. ఏ. అండ్ కో., "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి :: నెల్లూరుజిల్లా

[illegible]
చెరిష్ట గ్యారంటీ కేట్లుగుంచితం
రు1000 ల బహుమానం
గుణముచేయని ఋజువు చేయువారికి
[illegible]

ఈ పేర్లు జ్ఞాపకం ఉంచుకోండి
'డూకో' కార్ ఫినిష్
'డూలక్స్' కోచ్ ఫినిష్
'నికొల్' ఇండస్ట్రియల్ ఫినిష్
DUCO
DULUX
NECOL
ఇండియాలో తయారైనవి
ICI
పెయింట్లు
సర్వోత్కృష్టమైన

ఐ. సి. ఐ. వాక్స్ &
నం. 7 పాలిష్‌లు.
ఇండియాలో ఉత్పత్తి
చేయువారు:
ది అల్కలీ & కెమికల్
కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.
సోల్ సెల్లింగు ఏజెంట్లు:
ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్.
కలకత్తా, బొంబాయి, మద్రాసు, కాన్పూర్, న్యూఢిల్లీ,
అహ్మదాబాదు, అమృతసర్, బెంగుళూరు, కొచ్చిన్.

DX-C 390 TE